క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ఎస్‌ఐ అబ్దుల్ రజాక్



రేపల్లె: ప్రయాణికులు, పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద మదర్‌థెరిస్సా ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దొప్పలపూడి. వంశీకృష్ణ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రద్దీగా ఉండే ప్రాంతాలలో ఆటో యూనియన్ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయటం హర్షణీయమన్నారు. కార్మికులు ఐక్యమత్యంతో ఉండాలని, అప్పుడే తమకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ముందుకు సాగవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, మదర్ థెరీసా ఆటో స్టాండ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు జె.ధర్మరాజు, కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ డి.వంశీకృష్ణ, బాబూరావు, భిక్షాలు, కుమార్ పాల్గొన్నారు.

1న సమీక్షా సమావేశం

రేపల్లె: పట్టణంలోని రామకోటిపేటలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించబడునని వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబులు గురు వారం ఒకప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ వార్డుల ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

బైక్ మీద నుంచి పడి తీవ్రగాయాలు



గాయాలపాలైన నాగరాజు

కర్లపాలెం: జాతీయ రహదారికి ఉన్న గుంటలలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన కర్లపాలెం మండలంలోని సత్యవతీపేట గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన నాగరాజు చీరాలలోని ఐటీసీ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తిరిగి ఇంటికి వస్తున్న నేపథ్యంలో కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతీపేట వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి వస్తూ... బైక్ అదుపుతప్పి పడిపోవటంతో నాగరాజు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో సిబ్బంది చీరాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

కారు ఢీకొని విద్యుత్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు



గాయాలపాలైన యానాదిరావు

కర్లపాలెం: వేగంగా వస్తున్న కారు మోటారు బైక్‌ను వెనుక నుంచి ఢీ కొనటంతో బైక్ పై ఉన్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కి తీవ్ర గాయాలైన సంఘటన కర్ల పాలెం హెచ్‌జెబీ డిగ్రీ కాలేజ్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెరుకుపల్లిలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కట్టా యానాదిరావు బాపట్ల నుంచి డ్యూటీకి చెరుకుపల్లి వెళ్లేందుకు ద్విచక్ర మోటారు వాహనంపై వస్తుండగా బాపట్ల నుంచి వేగంగా వెనుక నుంచి వచ్చిన కారు మోటారు వాహనాన్ని ఢీ కొనడంతో యానాదిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడైన యానాదిరావుకు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించినట్లు స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బాపట్ల జిల్లా వాసి మృతి

శావల్యాపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ గల్లా రవికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన యరమనేని కోటేశ్వరరావు (39) నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో వ్యక్తిగత పనులు చూసుకుని తిరిగి వినుకొండ వైపునకు బైకుపై బయలుదేరారు. శావల్యాపురం హైస్కూల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. యరమనేని కోటేశ్వరరావు తల, కాలుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



బాపట్లలో జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవం



కొల్లూరు ఈమనివారిపాలెంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆవులవారిపాలెం రామాలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివార్లు

శ్రీరామరక్ష... సర్వజగద్రక్ష

వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

బాపట్ల: శ్రీరామనవమి సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలో అంగరంగవైభవంగా శ్రీరామచంద్రులకు కల్యాణమహోత్సవం గురువారం నిర్వహించారు. పట్టణంలోని భీమావారిపాలెం శ్రీకోదండరామాలయంలో స్వామి వారి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక చీలురోడ్డులోని రామాలయంలో కూడా ప్రత్యేక ఉత్సవాలు జరిగాయి. అర్చకస్వాములు స్వామి కల్యాణమహోత్సవ వైభవం గురించి తెలియజేశారు. పట్టణంలోని సూర్యలంక రోడ్డులో కామరాజుగడ్డ శ్రీనివాస విజయకుమార్ అత్యంత వైభవంగా వడపప్పు పానకాన్ని భక్తులకు అందించారు. కొంతమంది షాపు యజమానులు కూడా చలువపందిళ్లు ఏర్పాటు చేసి పానకాన్ని అందించారు.

పాండురంగ స్వామి ఆలయంలో....

బాపట్ల అర్బన్: చీలురోడ్‌లో వేంచేసిన రుక్మిణి సమేత పాండురంగ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శ్రీరామనవమి సందర్భంగా సీతా లక్ష్మణ హనుమత్ పరివార సమేత శ్రీరామచంద్ర స్వామి వారికి శాంతి కల్యాణ మహోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు స్వామివారి ప్రసాద వితరణ చేశారు. అర్చక స్వామి రొంపిచర్ల కేశవాచార్యులు, పీటల మీద హరీష్, లక్ష్మీహారిక, దంపతులు, మురళి వెంకటరమణ నీరజాదేవి దంపతులు పాల్గొన్నారు.

ఇమ్మడిశెట్టివారిపాలెంలో...

పట్టణంలోని ఇమ్మడిశెట్టివారిపాలెంలో ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఇమ్మడిశెట్టిపాలెంలో శ్రీ రామ నవమి సందర్భంగా స్వామి వారి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో కన్నుల పండుగగా కల్యాణం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

వలివేరులో...



వలివేరులో శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

చుండూరు (భట్టిప్రోలు): చుండూరు మండలం వలివేరులోని రెడ్ల వారి రామమందిరంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాలలో తమ్మా పున్నారెడ్డి-భూలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, వడపప్పు, పానకం, చలిమిడి అందజేశారు.



కొల్లూరు మండలం ఆవులవారిపాలెం రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుకలలో భక్తులు

నిజాంపట్నంలో...



కూచినపూడిలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న యల్లాప్రగడ శేషతల్పసాయి దంపతులు

నిజాంపట్నం: సమాజానికి ఆదర్శదంపతులైన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు మండలంలో వాడవాడలా కనుల పండుగగా జరిగాయి. గురువారం మండలంలోని రామాలయాల్లో ప్రత్యేకంగా వేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, వేదమంత్రాల నడుమ జరిగిన కల్యాణ వేడుకలలో పలువురు దంపతులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం, ఆముదాలపల్లి, ముత్తుపల్లి, పల్లపట్ల, అడవులదీవి, కూచినపూడి, దిండి, కొత్తపాలెం, ప్రజ్ఞం, గుర్నాధనగర్, హరిస్‌పేట, బొర్రావారిపాలెం గ్రామాలలో ఉన్న శ్రీసీతారాముల మందిరాలలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు వడపప్పులు, పానకం ప్రసాదాలను పంచిపెట్టారు. కూచినపూడి గ్రామంలోని సీతారామ స్వామి దేవాలయం నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి కావడంతో ఆలయ ధర్మకర్త యల్లాప్రగడ శేషతల్పసాయి దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

కర్లపాలెంలో....

కర్లపాలెం: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు గురువారం మండలంలో వాడవాడలా అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఉన్న రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం జరిపించేందుకు ప్రత్యేకంగా చలువ పందిళ్లు వేసి మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. అరటి గెలలు, తాటి గెలలు, పుచ్చకాయలు, గుమ్మడి కాయలు, వివిధ రకాల పండ్ల గెలలతో పందిళ్లకు అలంకారం చేశారు. చలువ పందిళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై సీతారాముల విగ్రహాలు, చిత్రపటాలను ఉంచి పూలమాలలతో అలంకరించారు. మంగళవాయిద్యాలతో గ్రామస్తులు తీసుకు వచ్చిన తలంబ్రాలను స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వేద మంత్రాలు చదువుతూ సీతారాముల విగ్రహాలపై జీలకర్ర, బెల్లం ఉంచి పూజలు నిర్వహించారు. అమ్మవారి మంగళ సూత్రాలను భక్తులు దర్శించుకున్న అనంతరం సీతారాముల కల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా జరిపించారు. సీతారాముల కల్యాణం అనంతరం చిత్రపటాలకు భక్తులు అక్షింతలు వేసి పూజలు చేశారు. మండలంలోని నాగరాజుపాలెం, దమ్మనవారిపాలెం, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, యాజలి, బుద్ధాం ఏట్రవారిపాలెం, కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, పాతనందాయ పాలెం, కర్లపాలెం, పాపిరెడ్డిపాలెం, బంగారురెడ్డిపాలెం, ఆట్లవారిపాలెం, చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, నర్రావారిపాలెం, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, పేరలి, కొత్తపాలెం, సమ్మెటవారిపాలె, శీలంవారిపాలెం, సత్యవతీపేట గ్రామాలలోని రామాలయాలలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పానకం వడపప్పు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పిట్టలవానిపాలెంలో....

పిట్టలవానిపాలెం: మండలంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్ని గ్రామాలలోని రామాలయాల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో ప్రత్యేకంగా అలంకరించిన ప్రదేశంలో కల్యాణాన్ని జరిపించారు. మరికొన్ని గ్రామాల్లో సీతారాముల వారి చిత్రపటాలను ఏర్పాటు చేసుకుని కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు.

ఖాజీపాలెంలో...

శ్రీ కోదండరామాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో భక్తులు, పలువురు ప్రముఖులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు మాట్లాడుతూ గత 150 ఏళ్లగా ఖాజీపాలెం శ్రీకోదండరామాలయంలో నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, మాజీ సర్పంచ్ మంతెన రామచంద్రరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పిట్టలవానిపాలెం శ్రీ సీతారామ చంద్రమూర్తి దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం 5 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చోడిపాలెం...

భవనంవారిపాలెం శివారు చోడిపాలెంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువలా జరిపించారు. ఆయా గ్రామాలలో శ్రీరామనవమిని పురస్కరించుకుని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ చోడిపాలెంలో దేవాలయం నిర్మించి షుమారు 160 ఏళ్ల పైగా అయ్యిందని నాటి నుంచి ప్రతి ఏడాది నవమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పానకం, వడపప్పు, కొబ్బరిని స్వామి వారికి సమర్పించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కోమలి, జీఎస్‌పాలెం, భవనం వారిపాలెం, పిట్టువారిపాలెం, కొత్తపాలెం, మన్నెం వారిపాలెం గ్రామాలలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా జరిపించారు.

కొల్లూరులో...

కొల్లూరు: శ్రీరామనవమి వేడుకలలో భాగంగా సీతారాముల కల్యాణ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారం మండలంలోని గ్రామాలలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల వద్ద అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల నడుమ శ్రీరామనవమి వేడుకలు కనులవిందుగా జరిగాయి. మండలంలోని ఆవులవారిపాలెంలోని రామాలయం, కొల్లూరులోని పలు ఆలయాలతోపాటు, మండలంలోని రామాలయాలు, రామమందిరాలలో నవమి వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: శ్రీరామ నవమి పురస్కరించుకుని ఊరువాడా పులకించింది. భక్తి పారవశ్యంలో ఓలలాడింది. జగదానంద కారక...జయ జానకి ప్రాణ నాయక....అంటూ శ్రావ్యంగా ఆలపిస్తున్న రికార్డులు సీతారాముల కల్యాణాన్ని తలపింప చేశాయి. చూడ చక్కని సీతమ్మ, అందాల రాముని కల్యాణాన్ని భక్తజనం కనులారా తిలకించి పరవశించింది. భట్టిప్రోలులోని అన్ని రామాలయాలలో గురువారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరాముడు పుట్టిన రోజు ఐన చైత్ర మాసం నవమి తిథి నాడే సీతారాముల కల్యాణం జరిగింది. దీంతో భక్తులు ఏటా శ్రీరామనవమి వేడుకలు జరుపుకుంటారు. భట్టిప్రోలు విఠలేశ్వరనగర్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కోదాటి ఏడు కొండలు-రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అద్దేపల్లి రామాంజనేయ గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో రామాంజనేయ నగర్ (ఎస్టీకాలనీ)లో కూడా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పడమట వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల ధార్మిక సేవా మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి, తదితరులు పర్యవేక్షించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఐదుగురు దంపతులచే కల్యాణోత్సవాన్ని జరిపారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రథమంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను సంఘం అధ్యక్షురాలు తూనుగుంట్ల నాగ సంధ్యారాణి పర్యవేక్షించారు.

రేపల్లె నియోజకవర్గంలో...



పట్టాభి రామస్వామి కల్యాణంలో ఏర్పాటు చేసిన కలశస్థాపన

రేపల్లె రూరల్: శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను నియోజకవర్గంలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాలలో సీతారాములను వధువరులుగా అలంకరించి విగ్రహాలను నెలకొల్పారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ మేళతాళాలతో స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో తటవర్తి విజయకుమార్-రాధిక దంపతులచే స్వామి వారి కల్యాణం వైభవంగా చేశారు. అదేవిధంగా కోదండ రామస్వామి, శివవార్డుమును సోబువారిపాలెం, మండలంలోని సింగుపాలెం, కైతేపల్లి, పెనుమూడి, మోళ్లగుంట, తుమ్మల, కారుమూరు తదితర గ్రామాలలో రాములోరి కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించారు. పెదకూరగాయల మార్కెట్, రైలుపేటలోని వర్తక సంఘాలు, ఓపెన్ థియేటర్ వెనుక, ఏబీఆర్ కళాశాల ఎదుట అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో, పాతస్టేట్ బ్యాంక్ సమీపంలో బాలభక్త బృంద సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు పానకం, వడపప్పు, చలిమిడిలను తీర్థప్రసాదాలుగా పంపిణీ చేశారు.



బాపట్లలో శ్రీరామనవమి సందర్భంగా వడపప్పు, పానకం అందిస్తున్న షాపుయజమానులు



అలకాపురంలో ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన సీతారాముల స్వామి



బాపట్ల పరిధిలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తజనం



ఎంవిరాజుపాలెంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నాగరాజుపాలెంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ విగ్రహాలు

పండిట్ చలమయ్యకు వేదవ్యాస బిరుదు

భట్టిప్రోలు: మండల పరిధిలోని ఐలవరం శ్రీ సీతారామ భక్త బృందం తాడిపర్తి వారి చలువ పందిరి ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా శ్రీ సీతారాముల కల్యాణ వార్షిక మహోత్సవానికి పురోహితులుగా వ్యవహరిస్తున్న యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి-కళావతి దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చలమయ్యకు పురోహిత మండల దీక్షా వేదవ్యాస బిరుదును ప్రముఖ వైద్యులు ఆకురాతి వెంకట సుబ్బారావు -వెంకట నాగ పద్మావతి (రేపల్లె) చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జ్ఞాపిక, మెమెంటో, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో గట్టు వెంకట్రావు-సుజాత దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రం కొతరపు శివశంకరరావు, వంగర చలమయ్య సిద్ధాంతిలచే భక్తి గీతాలాపన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమాలను చలువ పందిని నిర్వాహకులు పర్యవేక్షించారు.

వడ్డీ లేకుండా పన్నులు చెల్లింపులకు నేడే ఆఖరి రోజు

రాత్రి వరకూ కొనసాగనున్న కౌంటర్లు

గుంటూరులో 1.92 వేలకు పైగా అసెస్‌మెంట్లు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ఆస్తి పన్నులు చెల్లింపులు చేసేందుకు శుక్రవారం ఆఖరు రోజు కావడంతో నగరపాలక సంస్థ అధికారులు క్యాష్ కౌంటర్ల సమయం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.ఇందులో భాగంగా ఉదయం 8గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పాటు అదనంగా భారత్‌పేట 140వ వార్డు సచివాలయం, వసంతరాయపురం 148వ వార్డు సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106వ వార్డు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

నగరంలో 1,92,666 అసెస్‌మెంట్లు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,92,666 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రూ.146.29 కోట్లు డిమాండ్ కాగా గురువారం సాయంత్రం రూ.114 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.32 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా దీనిలో అన్ కలెక్టబుల్ డిమాండ్ సుమారు రూ.20 కోట్లకు పైగా ఉంది. గత సంవత్సరం ఇదే మార్చి 31వ తేదిన ఒక్కరోజే రూ.4.30 కోట్లు వసూలు చేశారు. నేడు ఆఖరు రోజు కావడంతో సుమారు రూ.5 కోట్లు పైగా వసూలు అవుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం మున్నంగి, వల్లభాపురం, అత్తలూరిపాలెం, పిడపర్రు, పిడపర్తిపాలెం, దంతలూరు, అత్తోట, కుంచవరం ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ పి.శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు.కార్యక్రమానికి ఆయా గ్రామాలల్లోని లబ్ధిదారులు, ప్రజాప్రతి నిధులు, అధికారలు ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.

సామూహిక దీక్షలు జయప్రదం చేయాలి

భట్టిప్రోలు: చేనేత పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, చేనేతపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏప్రియల్ 3,4 తేదీలలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో తలపెట్టిన 36 గంటల సామూహిక దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు జి. బాలాజి గురువారం పిలుపునిచ్చారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో బాలాజీ మాట్లాడుతూ ఉగాదికి ముందు సహజంగా వచ్చే ముహూర్తాలు వచ్చినా అక్కడ ఉన్న నిల్వలు ఏ మాత్రం తగ్గలేదన్నారు. ధర్మవరంలో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి పెద్ద ఎత్తున మర మగ్గాలపై చీరలు తయారు చేస్తున్న వాటిని అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. సమావేశంలో కె.మోహన్‌రావు, ఎ. రూపానంద్ పాల్గొన్నారు.

'ఆర్‌వీఆర్'లో హనీవెల్ మైక్రోసాఫ్ట్ శిక్షణ కార్యక్రమం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యంతో కూడిన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆయా కోర్స్‌లలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ హానీవెల్ సహకారంతో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై 100 గంటల సర్టిఫికేషన్ కోర్సు ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించటం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కోర్స్‌లో చేరి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, శేషగిరి, సత్తిబాబు, మల్లికార్జునరావు, ప్రశాంత్ తదితరులున్నారు.